సాక్షి
నారాయణపేట
గురువారం, 11, ఏప్రిల్, 2024



దేశంలో కాంగ్రెస్ లేదు

దేశంలో కాంగ్రెస్ పార్టీయే లేదని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు.

వివరాలు 8లో ▸



నగదు పట్టివేత

ఉమ్మడి జిల్లాలో వాహనాల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.9 /23.5

ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వడ్లు క్వింటా రూ.2,517

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వడ్లు (సోనా) క్వింటా గరిష్ఠంగా రూ.2,517, కనిష్ఠంగా రూ.2,090 ధర పలికాయి. అలాగే, వడ్లు హంస గరిష్ఠంగా రూ.1856, కనిష్ఠంగా రూ.1680, ఆముదాలు గరిష్ఠ, కనిష్ఠంగా రూ.5,461, పెసర గరిష్ఠంగా రూ.8,864, కనిష్ఠంగా రూ.8,855, వేరుశనగ గరిష్ఠంగా రూ.5,649, కనిష్ఠంగా రూ.4,800 ధర పలికాయి. ఇక జొన్నలు గరిష్ఠంగా రూ.4,929, కనిష్ఠంగా రూ.2,451, ఎర్ర కందులు గరిష్ఠంగా రూ.11,469, కనిష్ఠంగా రూ. 10 వేలు, తెల్ల కందులు గరిష్ఠం, కనిష్ఠంగా రూ. 11,609 ధర పలికాయి.

రేపు అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

నారాయణపేట రూరల్: పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్స్‌లో ఈ నెల 12న అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక ఉంటుందని ఆ సంఘం సెక్రటరీ రమణ తెలిపారు. ఈ నెల 28న సూర్యాపేటలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని, అందుకు జిల్లా నుంచి జట్టును ఎంపిక చేసేందుకు క్రీడాకారులకు పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ చాటిన వారితో జట్టు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపిక పోటీలకు అండర్ 14, 16, 18, 20 విభాగాల్లోని క్రీడాకారులు నేరుగా ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే నీటిఎద్దడికి కారణం

వీపనగండ్ల/చిన్నంబావి: డబ్బులు వెచ్చించి విద్యుత్ కొనే వెసులుబాటు ఉన్నా.. గత ప్రభుత్వం ముందుచూపుతో ఆలోచించకుండా నీటిని వదిలి విద్యుత్ తయారు చేయడంతో రిజర్వాయర్లు ఖాళీ అయి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం 50 గ్రామాలకు తాగునీరు అందించే గోపల్‌దిన్నె పంప్‌హౌస్‌ను పరిశీలించి మాట్లాడారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో కనిష్ఠ నీటిమట్టం ఉంచకపోవడమే నీటిసమస్యకు ప్రధాన కారణమన్నారు. సీఎంతో మాట్లాడి తాగునీటి అవసరాలకు నీటిని వదలాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు. అక్రమంగా మోటార్లు అమర్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.



రహదారులు రక్తసిక్తం

- ఉమ్మడి పాలమూరులో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృత్యువాత

- వివరాలు 8లో..

తాగునీటికి కష్టమే..

కృష్ణానదిలో అడుగంటిన జలం



కొల్లాపూర్ మండలం కోతిగుండు వద్ద కృష్ణానదిలో అడుగంటిన శ్రీశైలం బ్యాక్‌వాటర్

- శ్రీశైలం రిజర్వాయర్‌లో 809.6 అడుగుల లోతుకు నీరు
- ఉమ్మడి జిల్లాకు భగీరథ నీరు ఇక్కడి నుంచే
- తాగునీటి వినియోగానికి నెలకు 0.8 టీఎంసీ నీరు
- కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో యంత్రాంగం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఈఏడాది తీవ్రమైన వర్షాభావ పరిస్థితులతో కృష్ణానది నీరు లేక బోసిపోతోంది. వేసవి కాలంలో ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు లేక తాగునీటికి సైతం కటకట ఏర్పడింది. శ్రీశైలం రిజర్వాయర్‌లోని బ్యాక్ వాటర్ నుంచి ఏటా తాగునీటి అవసరాలకు వినియోగిస్తుండగా, ఈ సారి రిజర్వాయర్‌లో నీరు వేగంగా అడుగంటుతున్నాయి. మొత్తం 215.807 టీఎంసీలు, 885 అడుగుల ఎత్తు వరకు నీటి నిల్వ సామర్థ్యం ఉన్న శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుతం 809.6 అడుగులకు నీటిమట్టం పడిపోయి.. ప్రస్తుతం కేవలం 34.1 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉంది. ప్రాజెక్ట్ డెడ్‌స్టోరేజీ 29.3 టీఎంసీలు కాగా ప్రమాదకరస్థాయిలో తగ్గుతున్న నీటి నిల్వలతో రానున్న కాలంలో తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు

ఉమ్మడి జిల్లాలో తీవ్రమైన నీటి ఎద్దడి, తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమైంది. తాగునీటికి ఇబ్బందులు ఉన్న పట్టణాలు, గ్రామాలు, ఆవాసాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలను వేగంగా పూర్తి చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశించారు. మండలాల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మరమ్మతులకు గురైన బోరు బావులు, చేతిపంపులు యుద్ధప్రాతిపదికన బాగు చేయించాలని, నీటి కొరత ఉన్నచోట ప్రైవేటు వ్యక్తులకు చెందిన వ్యవసాయ బావులు, బోర్లను లీజుకు తీసుకుని ఆ నీటిని ప్రత్యామ్నాయంగా వినియోగించాలన్న ఆదేశాలున్నాయి.

జూరాలలో అడుగంటింది..

కృష్ణాతీరంలోని ప్రధాన ప్రాజెక్టు జూరాల రిజర్వాయర్‌లో ఈసారి నీరు కూడా లేకుండా పూర్తిగా అడుగంటింది. ఈ సీజన్ మొదటి నుంచే కృష్ణాలో నీటి జాడ లేకపోవడంతో యాసంగిలో అధికారులు రైతులకు సాగునీరు అందించలేమని చెబుతూ పంట విరామం (క్రాప్ హాలిడే) ప్రకటించారు. మొత్తం 9.657 టీఎంసీ సామర్థ్యం ఉన్న జూరాల రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.44 టీఎంసీ నీటికి పరిమితమైంది. ఈ నీటిని ఎలాంటి అవసరాలకు వినియోగించలేని పరిస్థితి నెలకొంది. వీటితో పాటు బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల్లోనూ నీటి జాడ లేక అయోమయ పరిస్థితి నెలకొంది.



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో డెడ్‌స్టోరేజీలో నీటిమట్టం

తాగునీటికి 5 టీఎంసీలు..

శ్రీశైలం రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ 29.3 టీఎంసీ కాగా, ప్రస్తుతం 34 టీఎంసీల నీరు ఉంది. మరో 5 టీఎంసీల వరకు తాగునీటి వినియోగానికి అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో తాగునీటి అవసరాలకు నెలకు 0.8 టీఎంసీ నీరు అవసరం పడుతోంది. ఈ మేరకు రిజర్వాయర్‌లో 800 అడుగుల వరకు నీటిని వాడుకునేందుకు అవకాశం ఉంది. కల్వకుర్తి ఎత్తిపోతల మొదటి పంపు ద్వారా ఎల్లూరు రిజర్వాయర్ నింపాం. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రణాళికబద్ధంగా కార్యాచరణ చేపట్టాం.

– విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీఈ, నీటిపారుదల శాఖ

ప్రాజెక్టులు వెలవెల.. గొంతు తడిపేదెలా..


బీమా ఎత్తిపోతల పథకం కింద 3.1 టీఎంసీ నీటితో సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లకు నీటిని అందించాల్సి ఉంది. అయితే వీటి పరిధిలో నీరు లేక ఈసారి సుమారు 1.50 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేయలేదు. బోర్ల కింద సాగుచేస్తున్న పంటలు సైతం నీరు లేక ఎండిపోతున్నాయి. నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు రైతుల సాగునీటికి నీరందించలేకపోయాయి. మక్తల్ మండలం పారేవుల గ్రామం వద్ద కృష్ణాతీరంలో ఏర్పాటు చేసిన సత్యసాయి పైప్‌లైన్ ద్వారా తాగునీటి కోసం నీటిని వినియోగిస్తున్నారు. అయితే రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడంతో పైప్‌లైన్ వరకు జేసీబీతో పూడిక తీయించి మరీ అధికారులు తాగునీటి సరఫరాకు సిద్ధం అవుతున్నారు.



మక్తల్‌మండలం పారేవుల వద్ద తాగునీటి పైప్‌లైన్ కోసం జేసీబీతో పూడిక తీస్తున్న అధికారులు



సంగంబండ రిజర్వాయర్ నుంచి మోటార్లతో పంటలకు నీటిని ఎత్తిపోసుకుంటున్న రైతులు



కృష్ణాతీరంలోని పసుపుల ఘాట్ వద్ద నీరు లేక బోసిపోతున్న బీమా రిజర్వాయర్

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు చేయండి



పేట ఈద్గాను సందర్శించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ఈద్గాను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి సందర్శించారు. గురువారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గాలో ముస్లింలు ఈదుల్ ఫితర్ నమాజ్ చేసుకునేందుకుగాను చేపట్టిన పలు పనులను పరిశీలించారు. ఈద్గా కమిటీ, మైనారిటీ మున్సిపల్ కౌన్సిలర్ల విన్నపం మేరకు ఎమ్మెల్యే చొరవ తీసుకొని వేసవి నేపథ్యంలో టెంట్‌లు, మంచినీటి క్యాన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇంకా పలు పనులు చేపట్టడం వీలు కాలేదని వచ్చే సంవత్సరం ఈద్గాలో మరిన్ని సౌకర్యాలు సమకూర్చుతామన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, పుర కౌన్సిలర్ ఎండి సలీం, నాయకులు మహిమూద్ ఖురేషి, యూసఫ్ తాజ్, అబ్దుల్ రహమాన్ చాంద్, మైనొద్దీన్, మున్వర్ ఫారుకి, మూర్తుజా చాంద్, ఈద్గా కమిటీ చైర్మన్, కౌన్సిలర్ అమీరుద్దీన్, అబ్దుల్ ఖాదర్, షాబుద్దీన్ తదితరులు ఉన్నారు.

పండుగలు సంతోషంగా జరుపుకోవాలి : ఎస్పీ

రంజాన్ పండుగను సుఖ సంతోషాలతో, కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం ఎస్పీ జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరంముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్, పెట్రోలింగ్, పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమాజంలో శాంతి స్థాపన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలన్నారు. ఎస్పీతో పాటు డీఎస్పీ ఎన్.లింగయ్య, సిఐ లు శివ శంకర్, రామ్ లాల్, ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

- ఎస్పీ యోగేష్ గౌతమ్
- సింగారంలో 8.85 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

నారాయణపేట: జిల్లాలో నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు. బుధవారం మధ్యాహ్నం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. నారాయణపేట మండలం సింగారంలో పూజారి మల్లప్ప ఇంట్లో దాదాపు 16 బ్యాగులలో రూ. 8 లక్షలకు పైగా విలువ చేసే 8.85 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్ ఫోర్స్, లోకల్ పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ విత్తనాలు కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా గుర్మిట్కల్ తాలూకా మల్లాపూర్ గ్రామానికి చెందిన జాజాపురం నర్సప్ప అనే వ్యక్తి రాయచూర్ జిల్లా శక్తి నగర్‌కు చెందిన బ్రహ్మయ్య కాటన్ మిల్ వద్ద తక్కువ రేటుకు దాదాపు 9 క్వింటాళ్ల విత్తనాలను కొనుగోలు చేశారన్నారు. అనంతరం ఓ వాహనంలో తీసుకువచ్చి సింగారం గ్రామంలో తన మామ పూజారి మల్లప్ప ఇంట్లో నిల్వ చేయడం జరిగిందన్నారు. అందులో నుండి ఒక క్వింటా నకిలీ పత్తి విత్తనాలను ఊట్కూరు మండలం నిడుగుర్తికి చెందిన కురువ బుగ్గప్ప విక్రయించాడు. అలాగే వేరే వ్యక్తులతో విక్రయించేందుకు ఇంటి వద్ద ఉండగా సంయుక్త దాడిలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుకోవడం జరిగిందన్నారు. ఆ తర్వాత నిడుగుర్తి గ్రామానికి వెళ్లి కురువ బుగ్గప్ప వద్ద నుంచి దాదాపు 85 కిలోల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

రూ.8.85లక్షల విలువ గల..

నకిలీ విత్తనాలు 8 క్వింటాళ్ల 85 కిలోలు వాటి విలువ రూ.8,85,000 ఉంటుందని ఎస్పీ తెలిపారు. నకిలీ విత్తనాలను పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు, అగ్రికల్చర్ అధికారులను ఎస్పీ గారు అభినందించారు. రివార్డు సైతం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. రైతులు ఆరుగాలం కష్టపడి వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతులకు నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి కేసులలో రిపీట్‌గా కేసులు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా వివరించాలని లైసెన్స్ కలిగిన వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు తప్పకుండా తీసుకోవాలని అలాగే వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలు సరఫరా చేసిన, విక్రయిస్తున్నట్లు తెలిస్తే జిల్లా పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

సమావేశంలో డీఎస్పీ లింగయ్య, సీఐలు శివ శంకర్, రామ్ లాల్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ అధికారి శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



మక్తల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మక్తల్: అమ్మ ఆదర్శ కమిటీలు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి బాటలో పయనింపజేయాలని.. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం పట్టణంలో అమ్మ ఆదర్శ కమిటీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా అధ్యక్షురాలు పాఠశాల చైర్మన్‌గా, కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎం, ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉంటారని అన్నారు. రెండేళ్ల పాటు కొనసాగే ఈ కమిటీలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తీర్మానాలు చేసి అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజనం నిర్వహణ, పాఠశాలకు ప్రభుత్వ పరంగా మంజూరైన నిధులు నిర్వహణ కూడా చూస్తారన్నారు. నిధులతో కిటికీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, ఎలక్ట్రిసిటీ స్విచ్ బోర్డుల ఏర్పాటు, మరమ్మతు చేసుకోవచ్చని, జూన్ 10 లోపు ఆయా పనులు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ హిర్యానాయక్, ఆర్డీఓ అంజయ్య, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంఈఓ వెంకటయ్య, సీఎంఓ రాజేంద్రకుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు..

ఊట్కూర్: తాగునీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు ఆదేశించారు. మండలంలోని ఎడివెల్లి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులు గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో బోర్‌లలో నీరు ఇంకిపోతున్నాయని నీటి ఎద్దడి తీవ్రమయ్యే పరిస్థితి నెలకొందని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ గ్రామ చెరువు సమీపంలో రెండు రోజుల్లో కొత్తగా బోరు వేయించి ట్యాంక్‌కు కనెక్షన్ ఇప్పించి సరఫరా చెయ్యాలని ఆదేశించారు. గ్రామంలో నీటి ఎద్దడి పరిష్కారానికి కాచ్వార్ గ్రామం వద్ద సంపు హౌస్‌ను నిర్మించి మిషన్ భగీరథ నీటిని సరఫరా చెయ్యాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. దీంతో వారం రోజుల్లో సంపుహౌస్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ధనుంజయ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ఫౌండేషన్ కోర్సుపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి పాండు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 82470 39192 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఓటుతో గుణపాఠం చెప్పాలి

మక్తల్: ప్రజలను మోసం చేసిన వారికి.. స్వార్థపరులకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డితోపాటు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరు కలిసికట్టుగా పనిచేయాలని, భారీ మెజార్టీ వచ్చేలా పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ నాయకురాలు డీకే అరుణకు సీఎంను విమర్శించే నైతిక హక్కు లేదని, తమ వ్యాపారం, లాభాల కోసం రాజకీయం చేయడం, అధికారం వస్తే చాలు ఎన్ని పార్టీలు అయినా మారుతారని విమర్శించారు. గద్వాల రాజకీయాలు మక్తల్‌లో చేస్తే చెల్లవని అన్నారు. అనంతరం వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గద్వాల్‌లో అల్లుడికి మద్దతు ఇచ్చిందని, మక్తల్‌లో బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చినా అధర్మం ఓడిపోయి ధర్మం గెలిచిందన్నారు. ప్రజలు అన్ని గమనించి డీకే అరుణను ఇంటికి పంపించడం జరుగుతుందని అన్నారు. కార్యకర్తలు తనపై నమ్మకం పెట్టి బారీ మోజార్టీతో గెలిపించాలనరి కోరారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ వంశీచందర్‌రెడ్డి ప్రజల మధ్య ఉంటూ సేవలు అందించే నాయకుడని, అసెంబ్లీ ఎన్నికలు ఏ విధంగా తన గెలుపు కోసం పనిచేశారో ఎంపీ ఎన్నికల్లో అలాగే పనిచేయాలని, ప్రతి గ్రామంలో బూత్ నుండి మెజార్టీ రావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ వనజ, మాజీ ఎంపి కుమారుడు మిథున్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బికేఆర్ చేర్మేన్ బాలక్రిష్టారెడ్డి, హన్మంతు, గణేష్‌కుమార్, రామేశ్వరి, అనంద్‌గౌడ్, రాజప్పగౌడ్ పాల్గొన్నారు.

కుట్టుపనితో మహిళలకు ఉపాధి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు యూనిఫాం కుట్టే పనిని తాజాగా మహిళా సంఘం సభ్యులకే అప్పగించారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా కుట్టించేవారు. అయితే మహిళా సంఘాలకు ఇస్తే బాగుంటుందని కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా వారికి ఇంటి వద్దే ఉపాధి లభిస్తుందని భావిస్తోంది. కాగా, జిల్లాలోని మూడు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 131 స్లమ్ సమాఖ్యలు ఉన్నాయి. వీటిలో మొత్తం 3,678 మహిళా సంఘాలు నమోదు కాగా 37,163 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఎంత మంది ముందుకు వచ్చినా ఈ పనిని అప్పగించగనున్నారు. ఇప్పటివరకు 90 సంఘాలు ముందుకు వచ్చాయి. ఇందులో మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన 40, జడ్చర్లలోని 35, భూత్పూర్‌కు చెందినవి 15 ఉన్నాయి. ఒక్కో యూనిఫాంకు రూ.50 చొప్పున మెప్మా అధికారులు చెల్లిస్తారు. అయితే కనీసం రూ.వందనైనా ఇస్తే తమకు గిట్టుబాటు అవుతుందని మహిళలు చెబుతున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం కేవలం క్లాత్ మాత్రమే సరఫరా చేయనుంది. మిగతావి కట్టింగ్, కాజులు, గుండీలు, దారం తదితర వస్తువులను మహిళలే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. త్వరలోనే మాస్టర్ కట్లర్లతో వీరికి ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నారు.

12,329 మంది విద్యార్థులకు యూనిఫాం

జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో 23,889మంది విద్యార్థులకు యూనిఫాం ఇవ్వనున్నారు. ఇందులో మహబూబ్‌నగర్ పట్టణంలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు 12,329 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో బాలురు 6,028 మంది, బాలికలు 6,301 మంది ఉన్నారు. అలాగే జడ్చర్ల పట్టణంలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు 7,633 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కొత్తగా కుట్టించే యూనిఫాం అందజేస్తారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

మూడు మున్సిపాలిటీల పరిధిలోని సంఘాల సభ్యులు వీలైనంత ఎక్కువ మంది ఈ యూనిఫాం కుట్టేందుకు ముందుకు రావాలి. దీనివల్ల ఇంటి వద్దే ఉపాధి లభించడమే గాక ఆర్థికంగా ఎదగడానికి వీలవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.కె.ఐ.అలీ, మెప్మా పీడీ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


దశరయ్య (ఫైల్)

వెల్దండ: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చల్లపల్లిలో బుధవారం ఉపాధి కూలీ మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చల్లపల్లికి చెందిన కొమ్ము దశరయ్య (54)తో పాటు మరో 28 మంది కూలీలు గ్రామానికి చెందిన రైతు కొమ్ము దశరథం పొలంలో ముళ్లపొదల తొలగింపు పనులకు వెళ్లారు. పనులు చేసే క్రమంలో వడదెబ్బతో దశరయ్య అస్వస్థతకు గురై పడిపోయాడు. తోటి కూలీలతో పాటు ఉపాధి సిబ్బంది వెంటనే ప్రైవేట్ వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దశరయ్యకు భార్య సుభద్రమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధిహామీ అధికారులు బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. డీఆర్డీఓ చిన్న ఓబులేష్, ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఏపీఓ ఈశ్వర్, టీఏ సత్యనారాయణ, కార్యదర్శి అన్నపూర్ణ, ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటేష్ పరామర్శించారు.

ఎమ్మెల్యే పరామర్శ..

కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అదుకుంటామని హామీచ్చారు. ఆయన వెంట జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, సంజీవ్‌కుమార్, జయప్రకాష్, పలువురు నాయకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ..

తెలకపల్లి: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈ నెల 7న నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి స్పృహతప్పి పడిపోయాడు. గుర్తించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇసుక కోసం బాహాబాహి

మద్దూరు: ఒకరు రెవెన్యూ శాఖ సిబ్బంది.. మరొకరు పోలీస్ శాఖలో పనిచేసే హోంగార్డు.. వీరిద్దరు ఇసుక తరలింపుపై బాహాబాహికి దిగిన ఘటన మద్దూరు మండలంలోని దోరేపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మద్దూరు తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ ఆంజనేయులును లింగాల్‌చేడ్ పెద్దవాగు వద్ద మన ఊరు –మన ఇసుక రీచ్ పర్యవేక్షణాధికారిగా నియమించారు. ఈక్రమంలో దోరేపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలింపు చేపట్టగా.. విషయం తెలుసుకున్న హోంగార్డు శ్రీను మఫ్టీలో అక్కడికి చేరుకున్నారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, బాహాబాహికి దిగారు. అందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. దీనిపై వారిద్దరిని స్పందించేందుకు యత్నించగా.. అందుబాటులోకి రాలేదు. ఎస్‌ఐ రాంలాల్‌ను వివరణ కోరగా, విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని 44వ నంబర్ జాతీయపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య మరో బాలుడు విఘ్నేష్‌ను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని మూసాపేట వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో శ్రీకృష్ణ హోటల్ సమీపంలో రోడ్డుపై అదుపు తప్పి బైక్ కిందపడింది. దీంతో ఇద్దరు గాయపడ్డారు. బాధితులను ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.



అరుదైన చేప లభ్యం

పీపనగండ్ల: వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలంలోని పుర్గర్‌చర్లలో రైతు మధుగని మహేష్ వ్యవసాయ బావిలో బుధవారం 5 ఫీట్ల పొడవు, 10 కిలోల బరువున్న కొంటి ముక్కు చేప లభించింది. బుధవారం పొలానికి నీరు పెడుతున్న సమయంలో ఈ చేప లభించినట్లు రైతు తెలిపారు. పొలం అమ్మచెరువు సమీపంలో ఉండడంతో చెరువులోంచి చేప బావిలోకి వచ్చి ఉంటుందని చెప్పారు. అరుదైన చేప కావడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి పాలమూరులో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృత్యువాత

- బిజినేపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన తుఫాన్ వాహనం
- ఇద్దరు కర్ణాటక వాసుల దుర్మరణం, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- నాగవరం తండాలో బైక్, కారు ఢీ కొనడంతో ఇద్దరు..
- దేవరకద్ర, మునగాల సమీపంలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు..
- విద్యుత్‌సంభాన్ని ఢీ కొట్టడంతో మరో యువకుడి మృతి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో రహదారులు రక్తసిక్తమయ్యాయి..బుధవారం ఒక్క రోజే జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృత్యువాత పడి.. వారి కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చారు. దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి వద్ద వాహనం డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు కర్ణాటక వాసులు, వనపర్తి జిల్లా నాగవరం తండా సమీపంలో కారు, బైక్ ఢీకొనడంతో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇద్దరు, పెబ్బేరు సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఢీ కొని ఓ యువకుడు, ఎర్రవల్లి చౌరస్తాలో బైక్ అదుపుతప్పి మరో వ్యక్తి, దేవరకద్ర సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మరో వ్యక్తి మృత్యువాత పడ్డారు.

– బిజినేపల్లి/పెబ్బేరు రూరల్/ఎర్రవల్లి చౌరస్తా/దేవరకద్ర రూరల్

దైవదర్శనానికి వెళ్లొస్తూ.. అనంతలోకాలకు..


ప్రమాదానికి గురైన వాహనం


నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శ్రీశైల క్షేత్రంలో దైవదర్శనం చేసుకుని, తిరుగు ప్రయాణమైన కర్ణాటక వాసులు ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలకేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా టికోటా మండలం రాంపూర్‌కు చెందిన వందన (55), భారతి (44), మహాదేవి, దానమ్మ, నాగవ్వ, ధన్‌పాల్, సావిత్రి, సుఖ్‌దేవి, అనిత, మల్లమ్మ, మల్లప్పలు తుఫాన్ వాహనంలో శ్రీశైలం క్షేత్రానికి వెళ్లారు. అక్కడ దైవదర్శనం అనంతరం మంగళవారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి సమయంలో బిజినేపల్లిలోని పెట్రోల్ బంక్ వద్ద అసంపూర్తిగా, ఎలాంటి సూచికలు లేని డివైడర్‌ను వీరి వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వందన అక్కడికక్కడే మృతి చెందగా.. భారతి, అనిత, డ్రైవర్ దేవేందర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భారతి మృతి చెందింది. డ్రైవర్ దేవేందర్, అనితల పరిస్థితి విషమంగా ఉందని తోటి ప్రయాణికులు తెలిపారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిర్లక్ష్యంపై కేసు నమోదు

బిజినేపల్లిలో చేపట్టిన డివైడర్ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన డివైడర్ వద్ద సూచిక బోర్డు కానీ, రేడియం స్టిక్కర్స్ కానీ లేకపోవడంతో ఈ దుర్ఘటన జరిగిందని వాహనదారులు అంటున్నారు. ఈ ప్రమాదం కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని, ఇందుకు రెండు ప్రాణాలు పోయాయని మండిపడ్డారు. స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులకు సైతం నోటీసులు జారీ చేస్తామని పోలీసులు తెలిపారు.


ప్రమాదానికి కారణమైన డివైడర్ వద్ద కనిపించని సూచిక బోర్డులు

స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు వచ్చి వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన పెబ్బేరులోని వనపర్తి రోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్‌కు చెందిన తెలుగు చంద్రశేఖర్ (29) మంగళవారం సాయంత్రం బైక్‌పై వనపర్తిలోని స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు వచ్చాడు. కార్యక్రమం ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో పెబ్బేరు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం చంద్రశేఖర్ తండ్రి తెలుగు ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బైక్ అదుపుతప్పి మరొకరు..

బైక్ అదుపుతప్పి ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్, స్థానికుల కథనం మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా పెద్దదిన్నెకు చెందిన బోయ నడిపి నర్సింహులు (52) అదే గ్రామానికి చెందిన ఒండు నర్సింహతో కలిసి పని నిమిత్తం బైక్‌పై పొగాకు కంపెనీకి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. మునగాల శివారులో వారు ప్రయాణిస్తున్న బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా బోయ నడిపి నర్సింహులు మార్గమధ్యంలో మృతిచెందాడు. ఒండు నర్సింహను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. బోయ నడిపి నర్సింహులుకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారని.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీకొని.. ఇద్దరు

వనపర్తి జిల్లా నాగవరం తండా సమీపంలో కారు, బైక్ ఢీ కొనడంతో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్‌కు చెందిన వెంకటేష్ (32), జడ్చర్లకు చెందిన రవికుమార్ (33) వనపర్తి నుంచి కొత్తకోట వైపు బైక్‌పై వెళ్తుండగా.. నాగవరం తండా సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఐ నాగభూషణరావు ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో..


దేవరకద్ర సమీపంలో ప్రమాదానికి గురైన కారు

గుర్తుతెలియని వాహనం కారును ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన దేవరకద్ర సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును స్విట్స్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి (40) అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని మహబూబ్‌నగర్ మార్చురీకి తరలించారు. ఘటనా స్థలంలో మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని.. కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భారీగా నగదు పట్టివేత


నందిన్నె చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదు

మహబూబ్‌నగర్ క్రైం/పెబ్బేరు రూరల్/గట్టు/కేటీదొడ్డి/రాజోళి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వ్యాపారి డి.అనంతరెడ్డి రూ.7లక్షల నగదు తరలిస్తుండగా.. టూటౌన్ పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు.

- పెబ్బేరు మండలంలోని కర్నూల్ బైపాస్ వద్ద మరికల్ మండలం కన్మనూర్‌కు చెందిన కె.రంజిత్ కుమార్ ఎలాంటి ఆధారాలు లేకుండా తన కారులో రూ.3లక్షల నగదు తరలిస్తుండగా, పట్టుకున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.
- గట్టు మండల కేంద్రానికి చెందిన జాఫర్ అనే వ్యక్తి నుంచి రూ.54,500 నగదు పట్టుకొని, జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.
- కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద రాయచూర్ నుంచి గద్వాలవైపు తరలిస్తున్న రూ.60వేల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.
- ఉండవెల్లి మండలం ప్రాగటూరుకు చెందిన సూర్య మధుగౌడ్ రూ.లక్ష నగదుతో రాజోళికి వెళ్తుండగా.. సుంకేసుల డ్యాంపై ఉన్న చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

జెడ్పీ ట్రైనర్ వెంకటయ్యకు డాక్టరేట్


డాక్టరేట్ పొందిన వెంకటయ్యను అభినందిస్తున్న జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ ట్రైనర్ వెంకటయ్యకు అమెరికా గ్లోబల్ యూనివర్శిటీ ఆఫ్ బోస్టన్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈసందర్భంగా బుధవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రాఘవేందర్‌రావు ఆయనను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. 25 ఏళ్లుగా మహిళా సంఘాలకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ నిర్వహణ తదితర అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు సోషల్ మొబలైజర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సిబ్బందికి నిరంతరం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని చెప్పారు. ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేయడం హర్షణీయమన్నారు.కార్యక్రమంలో జెడ్పీ సూపరింటెండెంట్లు విజయ్‌కుమార్, శ్రీహరి, ఆనంద్, అశోక్, రవి, శ్యాంసన్, సత్యం, సతీష్, అనిల్ పాల్గొన్నారు.

ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రవాణా రంగంలో ఆటోరంగం ముఖ్యమైనదని.. అలాంటి ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని జమిస్తాపూర్‌లో బుధవారం తెలంగాణ ప్రొగ్రెస్సివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన మోటార్ చట్టంతో ఆటో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అనుకోకుండా జరిగే ప్రమాదాల్లో డ్రైవర్‌ను ప్రధాన నేరస్తుడిగా చూపిస్తూ, హత్యానేరం కేసు పెట్టేవిధంగా చట్టం చేయడం దారుణమన్నారు. ఈ చట్టానికి వ్యతరేకంగా పోరాటం సాగిస్తామన్నారు. ఆటో అండ్ మోటార్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జమిస్తాపూర్ ఆటో యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు.

'ఆరోపణలు అవాస్తవం'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గత మంగళవారం పలు పత్రికల్లో వచ్చిన కథనాలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమైనవని పీయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఎవరిని ఆఫ్ట్రాల్ అని మాట్లాడలేదని, కళాశాలలో తాను తీసుకున్న చర్యలు అన్ని కూడా నిబంధనల ప్రకారం చేసినట్లు పేర్కొన్నారు. డిప్యూటేషన్ నిబంధనల ప్రకారమే వ్యవహరించానని, ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బీఆర్‌ఎస్ చేసిందేమీలేదు



స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చేసిందేమీలేదని.. దీనిపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చర్చకు సిద్ధమా అని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి ని ఎందుకు ఇప్పించలేకపోయారని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్‌ను డ్రా చేసుకోలేని పరిస్థితి ఉండటంతో పాటు సప్లిమెంటరీ బిల్లులు కూడా రాలేదన్నారు. జీతాలు సరిగ్గా ఇవ్వలేదని.. ఒక్కో రోజు ఒక్కో జిల్లాకు ఇచ్చిన చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో 1వ తేదీనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు అందజేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు సంతోషంగా ఉండగా.. మాజీ మంత్రి జీర్ణించుకోలేక మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ మంత్రికి లేదన్నారు. సమావేశంలో టీఎన్‌జీఓ మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, గట్టు వెంకట్‌రెడ్డి ఉన్నారు.

దేశంలో కాంగ్రెస్ పార్టీ లేదు


మాట్లాడుతున్న డీకే అరుణ

- కొడంగల్ ప్రజలకు రేవంత్‌రెడ్డి ఏం చేశాడో చెప్పాలి: డీకే అరుణ

పాలమూరు: దేశంలో కాంగ్రెస్ పార్టీయే లేదు.. ఇక ఏ విధంగా అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థి అని కాంగ్రెస్‌లో ఏ ఒక్కరూ చెప్పుకోవడం లేదు. ₹అని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. గత సీఎం కేసీఆర్ భాషను రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, అధికారంతో అహంతో మాట్లాడితే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ఆయనపై కుట్ర చేస్తున్నారని, ఆయన్ను ఓడించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సింపతి కోసం కొత్త పాట పాడుతున్నాడని విమర్శించారు. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థి గెలవాలని అనుకోవడం ఏవిధంగా కుట్ర అవుతుందని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలో నువ్వు గెలవడానికి పని చేశావా? లేక ప్రత్యర్థులు గెలవడానికి పని చేశావా చెప్పాలని డిమాండ్ చేశారు. మరీ డీకే అరుణ పోటీలో ఉంటే గెలువడానికి ప్రయతిస్తుంటే కుట్రలు చేస్తున్నారని చెప్పాడం సరికాదని, రాత్రి వేళలో వచ్చి వెళ్తున్నారని మాట్లాడటం సరికాదని, మేము దొంగలం కాదని, దర్జాగా పగటి సమయంలోనే వస్తామన్నారు. కొడంగల్ ఏమైనా నీ సామ్రాజ్యమా.. ఆ నియోజకవర్గంలోని అన్ని మండలాలు తిరుగుతున్నాని ఆపే శక్తి నీకు ఉందా అంటూ సీఎంపై మండిపడ్డారు. మొదట రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన నువ్వు ఆ ప్రాంతానికి ఏం చేశావో ప్రజలకు చెప్పాలని, కేవలం జీఓలు ఇచ్చినంత మాత్రనా ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు ప్రారంభం అయినట్లు కాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించావ్ అని మాట్లాడుతున్నావ్.. మొదట కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదని స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన తర్వాత పార్టీ పటిష్టం కోసం కాంగ్రెస్‌లోకి తీసుకున్నారన్నారు. మొదట ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. కృష్ణ-వికారాబాద్ రైల్వే లైన్ పనులు కేంద్రం ఇచ్చే నిధులతో అవుతాయని, దీంట్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది ఏం లేదన్నారు.నీవు ముసలివాడికి కాదుకదా.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కోసం మహబూబ్‌నగర్ నుంచి ఢిల్లీకి పాదయాత్ర చేసేది ఉండేదన్నారు. ప్రస్తుతం ఉన్న పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్‌లు మార్చారని, ఇప్పటికైనా జూరాల నుంచి నీరు తీసుకువచ్చి ఏడు నియోజకవర్గాలలో ఉన్న భూములకు సాగునీరు అందిస్తే సహకారం అందిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అనే విషయం మరిచిపోతున్నాడని రోజుకు పదిసార్లు నేను సీఎం అనే విషయాన్ని ఆయన గుర్తు చేసుకోవాలన్నారు.

పెబ్బేరులో 8 దుకాణాల్లో చోరీ

పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణ కేంద్రంలో 8 దుకాణాల్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా మున్సిపల్ కాంప్లెక్స్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 8 దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. 3 కిరాణం దుకాణాలు, దొడ్ల డెయిరీ, మందులు, వస్త్ర దుకాణం, మేఘన లేడీస్ కార్నర్, అక్షర మొబైల్ షాపులో చోరీ జరిగింది. అందులో మేఘన లేడీస్ కార్నర్‌లో రూ.45 వేలు చోరీ జరిగిందని, అక్కడే ఉన్న అక్షర మొబైల్ దుకాణంలో 3 ఫోన్లు పోయినట్లు దుకాణం యాజమాని బిలకంటి రామస్వామి ఫిర్యాదు చేశారు. మిగతా 6 దుకాణాల్లో ఎక్కువ మొత్తంలో డబ్బులు ఉంచకపోవడంతో పెద్ద ఎత్తున చోరీకి గురికాలేదన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలియజేశారు. వనపర్తి నుంచి క్లూస్ టీమ్స్ సంఘటన స్థలానికి చేరకొని వివరాలు సేకరించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ రాంబాబు పరిశీలించారు.

తాళం వేసిన ఇంట్లో..

జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలోని ఎస్‌వీపీ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన మాధవి మూడు రోజుల కిందట తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. కాగా తాజాగా బుధవారం వచ్చి చూడగా.. ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో బీరువా తాళం సైతం పగల గొట్టి ఉంది. అందులోని 3 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.4 వేల నగదును దోచుకెళ్లినట్లు బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలియజేశారు.

ఎన్నికల వేళ.. డయల్ 1950 సేవ

- సమస్య ఏదైనా సంప్రదించవచ్చు
- కలెక్టరేట్‌లలో ప్రత్యేక సేవా కేంద్రాలు ఏర్పాటు



అచ్చంపేట: నవసమాజ నిర్మాణానికి ఓటు కీలకం. అంతటి కీలకమైన ఓటుహక్కు మీకు ఉందా.? ఒకవేళ ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది.? మరి కొత్తగా ఓటుహక్కు పొందాలంటే ఎవరిని సంప్రదించాలి.? ఏం చేయాలి.? వంటి అంశాల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి కలెక్టరేట్‌లో ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఓటరు సమస్యలను తెలుసుకోవడంతో పాటు అభ్యర్థులు ప్రచారంలో భాగంగా డబ్బు, మద్యం, కానుకలు వంటివి పంచినా.. నేరుగా ఫిర్యాదు చేసేలా టోల్‌ఫ్రీ నంబర్ 1950ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

కంట్రోల్‌రూం ఎలా పనిచేస్తుందంటే?

ఓటరు సమాచారం, ఫిర్యాదుల స్వీకరణకుగాను ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తంగా టోల్‌ఫ్రీ నంబర్ 1950 అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా జిల్లాల వారీగా కలెక్టరేట్‌లలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడి నుంచి అయినా 1950 నంబర్‌కు డయల్ చేస్తే, ఆ జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళ్తుంది. ఆయా జిల్లాలో ఎవరు లిఫ్ట్ చేయకపోతే, ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి కాల్ కనెక్ట్ అవుతుంది. ఇలా మనం చేసే ఫోన్ తప్పక కలిసేలా చర్యలు తీసుకున్నారు. ఓటరు చేయాల్సిందల్లా తమ చేతిలోని ఫోన్‌కు పని చెబితే చాలు. సిబ్బంది ఆ సమాచారాన్ని నమోదు చేసుకుని, ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఫిర్యాదుదారుకు కావాల్సిన సమాచారం చేరవేస్తారు.

నిరంతర పర్యవేక్షణ..

ప్రతి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటుచేశారు. ఇక్కడ మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటల పాటు ముగ్గురు నుంచి ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏ సందేహం ఉన్నా.. 1950 నంబర్‌కు డయల్‌చేస్తే, కంట్రోల్‌రూం సిబ్బందికి సమాచారం అందుతుంది. డయల్ చేసిన వ్యక్తి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి, తగు చర్యలు తీసుకుంటారు.